


జాడలేని యాక్షన్ ప్లాన్

- స్వయం ఉపాధి పథకాలకు నోచుకోని దళితులు
- 1264 మందికి విడుదల కానీ రూ. 17.24 కోట్లు
- ప్రభుత్వం మారినా అమలుకు నోచుకోని వైనం
- కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న లబ్ధిదారులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

నిరుద్యోగ దళిత యువతీ, యువకులు స్వయంఉపాధి పథకాలకు నోచుకోవడం లేదు. ప్రతి ఏటా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 'యాక్షన్ ప్లాన్' రూపొందించి ఆ మేరకు లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్లను గ్రౌం డింగ్ చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లను నిర్వీర్యం చేయగా, కొత్తగా వచ్చిన ప్రభుత్వం కూడా వాటి గురించి పట్టించుకోవడం లేదు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమై నాలుగు మాసాలు గడిచినా కూడా ఇప్పటివరకు యాక్షన్ ప్లాన్‌కు దిక్కు లేదు. గతంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు విడుదల చేయాల్సిన 17 కోట్ల 24 లక్షల 2వేల 831 రూపాయల సబ్సిడీని విడుదల చేయకపోవడంతో యూనిట్లు గ్రౌండింగ్ కావడం లేదు. ఎంపికైన లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్, ఎంపీడీవో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

● 2018 వరకే సక్రమంగా అమలు..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రామాలు, పట్టణాల్లో ఉండే దళిత యువతీ యువకులు స్వయం ఉపాధి పనులు చేసుకునేందుకు స్వయం ఉపాధి పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేది. అలాగే వ్యవసాయ పరంగా బావుల తవ్వకం, బోర్లు వేయడానికి, విద్యుత్ కనెక్షన్లు, మోటార్ల కొనుగోలుకు, పాడి గేదెల కొనుగోలు, భూమి కొనుగోలుకు ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ అందించేవాళ్ల. 50 శాతం నుంచి 100 శాతం వరకు పథకాలను బట్టి సబ్సిడీని నిర్ధేశిస్తారు. సబ్సిడీ తక్కువగా ఉన్నప్పుడు లబ్ధిదారుడి వాటా, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి, సబ్సిడీని అందజేసి సంబంధిత యూనిట్‌ను గ్రౌండింగ్ చేస్తారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత 2018 వరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ప్రతి ఏటా యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి పథకాలను అమలుచేశారు. ఆ తర్వాత సక్రమంగా అమలు చేయలేదు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 300 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేశారు. ఆ యూనిట్ల విలువ 6 కోట్ల 56 లక్షల 80 వేలు కాగా, ఇందులో ప్రభుత్వ సబ్సిడీ 4 కోట్ల 38 లక్షల 97 వేల రూపాయలు, బ్యాంకుల ద్వారా 2 కోట్ల 17 లక్షల 83 వేల రూపాయల రుణాలు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం సబ్సిడీ సొమ్మును విడుదల చేయకపోవ డంతో ఆ యూనిట్లు గ్రౌండింగ్ కాలేదు. ఇప్పటికీ కూడా సదరు లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో 507 యూనిట్లకు అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఆ యూనిట్ల విలువ 19 కోట్ల 66 లక్షల 26 వేల 129 రూపాయలు కాగా, ప్రభుత్వ సబ్సిడీ 12 కోట్ల 21 లక్షల 7 వేల 831 రూపాయలు, బ్యాంకులు ద్వారా 7 కోట్ల 45 లక్షల 18 వేల 298 రూపాయల రుణాలు ఇవ్వాల్సి ఉంది. అలాగే ఇదే ఏడాది అప్పటి ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాడి గేదెల పెంపకాన్ని ప్రోత్సహించాలనే చొరవతో జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి పాడి గేదేల పెంపకాన్ని ప్రారంభించారు. వెయ్యి మంది మహిళా లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేసి గ్రౌండింగ్ చేయగా, ఎంపిక చేసిన 457 మంది లబ్ధిదారుల యూనిట్ల విలువ 9 కోట్ల 14 లక్షలు కాగా, ప్రభుత్వ సబ్సిడీ 6 కోట్ల 39 లక్షల 80 వేలు, బ్యాంకుల ద్వారా 2 కోట్ల 74 లక్షల 20 వేల రుణాలు ఇవ్వాల్సి ఉంది.

లబ్ధిదారులకు నిరాశ..

అప్పటి ప్రభుత్వం సబ్సిడీ సొమ్మును విడుదల చేయకపోవడంతో ఆ యూనిట్లు గ్రౌండింగ్ కాలేదు. ప్రభుత్వం సబ్సిడీ సొమ్మును విడుదల చేస్తుందని ఎంతో ఆశతో ఎదురు చూసిన లబ్ధిదారుల ఆశలు అడియాసలయ్యాయి. ఆ తర్వాత అప్పటి ప్రభుత్వం 2021లో దళిత బందు పథకాన్ని తీసుక వచ్చింది. రాష్ట్రంలో ఉన్న అన్ని దళిత కుటుంబాలకు రూ 10 లక్షల విలువైన యూనిట్లను 100 శాతం సబ్సిడీతో అందజేస్తామని ప్రకటించింది. పైలట్ ప్రాజెక్టు కింద హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఎంపిక చేసి యూనిట్లు మంజూరు చేసింది. తర్వాత 2022లో మిగతా నియోజకవర్గాలకు 100 యూనిట్ల చొప్పున కేటాయించారు. ఆ మేరకు జిల్లాలో 262 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్లను గ్రౌండింగ్ చేశారు. 2023లో రెండో విడతలో నియోజకవర్గానికి వెయ్యి యూనిట్లు కేటాయించగా, ఎమ్మెల్యేలు అధికారులకు జాబితాలు అందజేసిన రెండు, మూడు రోజులకే అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగా, దళితబంధు పథకాన్ని అటకెక్కించింది. కనీసం 2024-25 ఆర్థిక సంవత్సరానికి యాక్షన్ ప్లాన్ రూపొందించకపోగా, గతంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు సబ్సిడీ సొమ్ము విడుదల చేయలేదు. ఎన్నికలకు ముందు పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా జిల్లాలో పర్యటించిన ప్రస్తుత రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్లను నిర్వీర్యం చేసి ఆయా వర్గాలకు సబ్సిడీ పథకాలను వర్తింపజేయలేదని విమర్శించారు. అంతేగాకుండా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆయా కార్పొరేషన్లకు సరిపడా నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. ఆర్థిక సంవత్సరం ప్రారంభమై ఐదు మాసాలు గడుస్తున్నా కూడా ఇప్పటి వరకు యాక్షన్ ప్లాన్ రూపొందించక పోవడం విచారకరం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెండింగులో ఉన్న సబ్సిడీ సొమ్మును విడుదల చేసి, యాక్షన్ ప్లాన్ తయారు చేసి ఉపాధి కల్పించాలని దళితులు కోరుతున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 24 : గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీవో వీరబుచ్చయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులతో గ్రామాల్లో నిర్వహించాల్సిన పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీపీవో హాజరై మాట్లాడారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమతంగా ఉండాలని, దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా తుది ఓటరు జాబితా రూపకల్పన పకడ్బందిగా చేపట్టాలన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలుచేయాలని, ఫాగింగ్ సంపూర్ణంగా నిర్వహించాలన్నారు. ఇంటిపన్ను వసూలు వంద శాతం పూర్తిచేయాలని, గ్రామాల్లో చెత్తాచెదారం కనిపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో డిఎల్‌పీవో వేణుగోపాల్, స్వచ్ఛ భారత్ మిషన్ కోఆర్డినేటర్ రాఘవులు, పెద్దపల్లి ఎంపీడీవో ఘనుకోట శ్రీధర్, ఎంపీవో ఫయాజ్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు, మల్టీపర్పస్ వర్కర్‌లు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 24: తెలంగాణ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్య మకారుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాడ నారాయణరెడ్డి, పిడుగు కృష్ణ అన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసిన ఉద్యమకారులను గత ప్రభుత్వం గుర్తించలేని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఉద్యమకారులకు 250చదరపు గజాల స్థలాన్ని ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించలేదని, తెలంగాణ కోసం తాము అనేక కేసులతో పాటు జైలుకు వెళ్లివచ్చామన్నారు. ఈ నెల 27న తెలంగాణ ఉద్యమకారుల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సన్మానం ఉంటుందని, భారీఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తోడేటి శంకర్‌గౌడ్, అనుముల కళావతి, మాతంగి లక్ష్మణ్, గోషిక తిరుపతి, వీరాలాల్, మల్లేషం, అందె రాజకుమార్, చారి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం లక్ష్యాలను పూర్తిచేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, సెప్టెంబర్ 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు కేటాయించిన ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ పెండింగులో ఉన్న రైతుబీమా కేసులను పూర్తి చేయాలన్నారు. రైతు రుణమాఫీకి సంబంధించి పెండింగ్ ఉన్న రైతుల కేసులను అధికారులు ప్రత్యక్షంగా పర్యవేక్షించి అర్హులకు రుణమాఫీ ఫలాలు చేరే విధంగా చూడాలని, క్రాప్ బుకింగ్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణం ప్రారంభమైందని, ఆశించిన మేర ఆయిల్ పామ్ పంటల సాగు బదిలీ జరగడం లేదన్నారు. ప్రతి ఏఈవో పరిధిలో కనీసం 30 ఎకరాల వరకు ఆయిల్ పామ్ సాగు విస్తరించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ముందుకు వచ్చిన రైతుల నుంచి మొక్కల సబ్సిడీ డీడీ కట్టించాలన్నారు. డ్రిప్ ఏర్పాటుకు సంబంధించి పూర్తిస్థాయి సబ్సిడీ భరించేందుకు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ముందుకు వచ్చిందని, దీనిని వినియోగించుకొని రైతులు ఆయిల్‌పామ్ సాగు మారేలా చూడాలన్నారు. లాభదాయక పంటల దిశగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు విస్తరణ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు మొక్కల దగ్గర నుంచి డ్రిప్ ఇరిగేషన్, అంతర్‌పంటల సాగు ప్రతి అంశంలో ప్రభుత్వం సహకరిస్తూ సబ్సిడీలు అందిస్తుందన్నారు. వానాకాలం మార్కెటింగ్ సీజన్ సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సన్నద్ధం కావాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆది రెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ జాబ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 24 : ఇండియన్ ఎయిర్ ఫోర్స్ జాబ్స్‌పై జిల్లా కేంద్రంలోని స్వరూప గార్డెన్‌లో ఈనెల 26న యువతీయువకులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో 50శాతం మార్కులతో పాసైన విద్యార్థులకు అవగాహన సదస్సులో పాల్గొనడానికి అర్హులని, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు కూడా సదస్సుకు హాజరుకావచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

క్రీడలపై విద్యార్థులు ఆసక్తి చూపాలి

- జిల్లా క్రీడల అధికారి సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా స్పోర్ట్స్ అధికారి సురేష్

సుల్తానాబాద్, సెప్టెంబర్ 24: ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి కనబరిచే విధంగా వారిని ప్రోత్సహించాలని జిల్లా క్రీడల యువజన అభివృద్ధి అధికారి సురేష్ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంట గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ప్రారంభించిన డీవైఎస్‌వో సురేష్ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పోటీలను చాలెంజ్‌గా తీసుకోవాలని, గెలుపోటములు సమానంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. రేగడిమద్దికుంట గ్రామానికి చెందిన సాయి కిరణ్ బహుమతులు సమకూర్చారు. ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, సుల్తానాబాద్ ఎంఈవో సురేందర్, ఓదెల ఎంఈవో రాజయ్య, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కొమురోజు శ్రీనివాస్, జోనల్ కన్వీనర్లు దాసరి రమేష్, హెచ్ఎం రాధాస్వామి, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్ పాల్గొన్నారు

రైతులకు గిట్టుబాటు ధరలు దక్కేలా చూడాలి

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



పెద్దపల్లి మార్కెట్ యార్డు పాలకవర్గాన్ని సన్మానించి నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, సెప్టెంబర్ 24: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, గిట్టుబాటు ధరలు దక్కేలా చూడాలి పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సూచించారు. ఇటీవల నూతనంగా నియామకమైన పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్ కూర మల్లారెడ్డి, డైరెక్టర్లు మంగళవారం మండలంలోని శివపల్లి ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను కలిసి సన్మానించి, తమను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణరావు చైర్మన్, వైస్‌చైర్మన్, డైరెక్టర్లను సన్మానించి నియాకపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదని, ప్రభుత్వంపై రైతులకు ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలని, మార్కెట్‌లో రైతులకు గిట్టుబాటు ధరలు దక్కే విధంగా పాలక వర్గం కృషి చేయాలని విజయరమణారావు అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఆళ్ల సుమన్‌రెడ్డి(పోత్కపల్లి విండో చైర్మన్), కొమ్ము కరుణాకర్, సోమ చంద్రయ్య, మడగోని శ్రీనివాస్, కొలిపాక కనకయ్య, వేగోలపు పెద్ద రాజేశం, పిట్టల కొమురయ్య, ఎండీ గౌస్‌మియా, గోపతి సదానందం, కొల్లూరి రామచంద్రం, తిప్పారపు ప్రభాకర్, సరోత్తంరెడ్డి, ఎడ్ల మహేందర్, ప్రజాప్రతినిధులు, రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదాంలను సందర్శించిన ఆర్డీవో

మంథని, సెప్టెంబర్ 24: స్థానిక ప్రజా పంపిణీ బియ్యం గోదాంను మంథని ఆర్డీవో హనుమా నాయక్ మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు. గోదాంలోని స్టాక్, రికార్డులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌వో ప్రకారం డీలర్లకు బియ్యాన్ని తూకం వేసి అందజేయాలని సూచించారు. సరైన సమయంలో డీలర్లకు బియ్యం సరఫరా చేయాలని సూచించారు.

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా మనోహర్

మంథని, సెప్టెంబర్ 24: మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా మనోహర్‌ను నియమిస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేసిన మల్లికార్జునస్వామిని సీడీఎంఏకు సరెండర్ చేసిన నేపథ్యంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మనోహర్‌ను మంథని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా నియమించారు.

Sl. No.	LIABILITIES	Balance at the end of the 31/03/2024	Balance at the end of the 31/03/2023	Sl. No.	ASSETS	Balance at the end of the 31/03/2024	Balance at the end of the 31/03/2023
1.	Paid on Share capital	25,060,395-00	24,870,251.00	1.	Cash on Hand	11,020,845.00	10,002,191.00
2.	Reserve Fund & Other Reserves	112,584,599.79	97,262,793.71	2.	Current Accounts	41,099,213.19	30,764,245.48
				3.	Investments	496,769,997.44	479,313,736.44
3.	Deposits and Other Accounts	840,360,788.74	807,375,644.30	4.	Loans and Advances	478,916,681.20	467,414,292.20
4.	Reserve for NPA	37,236,148.00	33,436,148.00	5	Interest Pending Receivables	44,252,859.00	37,974,211.00
5.	Overdue Interest Reserve	33,300,995.46	28,859,347.46	6.	Other Assets	35,037,352.24	34,680,525.13
6.	Other Provisions	1,074,542.43	1,158,306.00	7.	Furniture and Fixture: 17700323.09		
7.	Other Liabilities	55,769,512.48	61,091,505.42		LESS (Depreciation)(-) 9370122.31	8,330,200.78	9,226,600.72
	Profit 2023-24	10,040,166.95	15,321,806.08				
	Grand Total	1,115,427,148.85	1,069,375,801.97		Grand Total	1,115,427,148.85	1,069,375,801.97

Sd/- ACCOUNTANT | Sd/- CHIEF EXECUTIVE OFFICER | Sd/- CHARTERED ACCOUNTANT

PROFIT & LOSS ACCOUNT FOR THE YEAR ENDING 31-03-2024

Sl. No.	EXPENDITURE	Balance at the end of the 31/03/2024	Balance at the end of the 31/03/2023	Sl. No.	INCOME	Balance at the end of the 31/03/2024	Balance at the end of the 31/03/2023
1.	Interest paid on Deposits	54,303,957.00	53,252,912.00	1.	Interest realised on Loan and advance and Investments	95,182,973.00	97,153,744.00
2.	Establishment Charges	7,510,198.00	6,287,962.00				
3.	Contingent Charges paid	5,269,996.00	5,660,840.37	2.	Contingent Charges	282,636.72	387,996.62
4.	Other Expenditure	18,709,273.89	17,294,616.21	3.	Sale amount & Other Charges	11,304.00	9,320.00
	Total	85,793,424.89	82,496,330.58	4.	Other Charges Collected	356,678.12	267,076.05
	Net Profit	10,040,166.95	15,321,806.08				
	Grand Total	95,833,591.84	97,818,136.67		Grand Total	95,833,591.84	97,818,136.67

Sd/- ACCOUNTANT | Sd/- CHIEF EXECUTIVE OFFICER | Sd/- CHARTERED ACCOUNTANT

అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రమోద్‌కుమార్

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 24: అంతర్జాతీయ సంకేత భాషల(బదిరుల) దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 23 నుంచి 29 వరకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ కె. ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఏఎన్ఎమ్‌లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రపంచంలో 9.9 శాతం మంది వినికిడి లోపంతో బాధపడుతున్నారని, వీరిలో 51.2 శాతం మంది 60ఏళ్ల వయస్సులో ఉన్నావారేనని, ఆ కుటుంబాలకు సైన్ లెర్నింగ్, మద్దతును అందించడానికి సేవలు తప్పనిసరిగా సిద్ధంగా ఉండాలన్నారు. ఈ అంతర్జాతీయ బధిరుల వారోత్సవాన్ని పాటించేందుకు జిల్లాలో వివిధ కార్యకలాపాలను నిర్వహించడం ద్వారా ప్రజలకు అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అన్నప్రసన్నకుమారి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాజమౌళి, డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్లు రాజేష్, మధుసూదన్, జిల్లా డాటా మేనేజర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నాణ్యమైన ఉపకరణాలు

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ గంగాధర్

గణేశ్‌నగర్, సెప్టెంబరు 24 : విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ ఉపకరణాలు తక్కువ ధరల్లో అందిస్తున్నామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వడ్లకొండ గంగాధర్ ఓ ప్రకటనలో తెలిపారు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్, కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అనుబంధిత ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈ ఎస్ఎల్) భాగస్వామ్యంతో ఉపకరణాలు అందిస్తున్నామన్నారు. విద్యుత్ ఆదా చేసేందుకు ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్ లైట్లు, ఇండక్షన్ స్టవ్, ఫైవ్‌స్టార్ బీఎల్‌డీసీ, ఫ్యాన్లు, సూపర్ ఎఫిషియంట్ ఎయిర్ కండిషనర్లు, ఎల్ఈడీ, ఇన్వర్టర్ బల్బులు అందుబాటులో ఉంచామన్నారు. వినియోగదారులు ముందుగా www.tgnpdcl.com వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) వారి హోం పేజీలోకి వెళ్లాలన్నారు. అక్కడ అందుబాటులో ఉన్న విద్యుత్ ఉపకరణాలను కొనుగోలు చేయవచ్చని తెలిపారు. వినియోగదారులకు కావాల్సిన విద్యుత్ ఉపకరణాలను సులభతరంగా ఆర్డర్ చేసుకోవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారలుఉ కొనుగోలు చేసిన వస్తువులు వారి ఇంటికే డెలివర్ చేస్తామని తెలిపారు. ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్) పేజీలో ఉన్న క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి ఆర్డర్ చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అస్వస్థతకు గురైన వృద్ధుడిని బస్సులోంచి దింపేసిన కండక్టర్

● దిగిన వెంటనే ఆగిన ఊపిరి ● మృతుడిది కామారెడ్డి జిల్లా

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24: అస్వస్థతకు గురైన వృద్ధుడిని ఆర్టీసీ బస్సులోంచి కండక్టర్ దింపేశాడు.. కొద్దిసేపటికే ఆ వృద్ధుడు గుండెపోటుతో మృతిచెందిన ఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు వట్టిమల్ల ఎల్లయ్య(67) తన భార్య రాజవ్వతో కలిసి కరీంనగర్‌లోని ఆసుపత్రికి వెళ్లేందుకు గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామం స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కారు. కరీంనగర్ వరకు టిక్కెటు తీసుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి వద్దకు బస్సు చేరుకోగానే వృద్ధుడు ఎల్లయ్య అస్వస్థతకు లోనయ్యాడు. కండక్టర్ ఆ దంపతులను ఇక్కడే హాస్పిటల్ ఉంది చూపించుకోమని బస్సు నుంచి కిందకు దింపేశాడు. వెంటనే ఎల్లయ్య కిందపడిపోగా అక్కడ ఉన్న యువకులు 108 వాహనానికి సమాచారం అందించడంతో సిబ్బంది చేరుకుని సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు వృద్ధుడు గుండెపోటుతో చనిపోయాడని నిర్ధారించారు. అస్వస్థతకు గురైన వృద్ధుడిపై మానవత్వం చూపాల్సిన ఆర్టీసీ బస్సు కండక్టర్ వృద్ధ దంపతులను బస్సు నుంచి కిందకు దింపేడయంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేటలో ఆసుపత్రి ఉందని అక్కడి వరకు తీసుకెళ్లాలని ప్రాధేయపడినా కండక్టర్ పట్టించుకోలేదని మృతుడి భార్య రాజవ్వ ఆవేదన వ్యక్తం చేసింది. ఆర్టీసీ కండక్టర్ వ్యవహరించిన తీరుపై అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని రాజవ్వతో పాటు స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

గ్రామపంచాయతీ సిబ్బందిని అడ్డుకున్న గ్రామస్థులు


గ్రామ పంచాయతీ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్థులు

తంగళ్లపల్లి, సెప్టెంబరు 24: కేసీఆర్ నగర్‌లో పారిశుధ్య పనులకు వెళ్తున్న గ్రామపంచాయతీ సిబ్బందిని గ్రామస్థులు మంగళవారం అడ్డుకున్నారు. తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామశివారులోని కేసీఆర్ నగర్‌లో గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులకు వెళ్తుండగా గ్రామస్థులు అడ్డుకొని ధర్నాకు దిగారు. కేసీఆర్ నగర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం సిరిసిల్ల పట్టణ వాసులకు కేటాయించి నిర్వహణ మున్సిపల్‌కు ఉండేది. 15 రోజుల క్రితం కేసీఆర్ నగర్ నిర్వహణ చేపట్టలేమని మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. కేసీఆర్ నగర్‌లో పారిశుధ్య పనులు నిర్వహణ లేక చెత్తాచెదారం పేరుకుపోవడంతో కలెక్టర్ సందర్శించి గ్రామపంచాయతీకి నిర్వహణ అప్పగించారు. గ్రామస్థులు కేసీఆర్ నగర్‌ను మండపల్లి గ్రామ పంచాయతీలో విలీనం చేయవద్దంటూ నిరసిస్తూ ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ క్రమంలో మంగళవారం మండెపల్లి గ్రామపంచాయతీ పారిశుధ్య సిబ్బంది కేసీఆర్ నగర్‌లో విధులు నిర్వహించడానికి వెళ్తుండగా గ్రామస్థులు అక్కడికి చేరుకొని వారిని అడ్డుకున్నారు. గ్రామపంచాయతీ గేటు ఎదుట ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని గ్రామస్థులకు నచ్చ చెప్పడంతో ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ నగర్‌ను మండేపల్లి గ్రామపంచాయతీలో విలీనం చేస్తే ఒప్పుకునేది లేదని తెలిపారు.

క్రైం కార్నర్

మరో రూ.14లక్షలు దుర్వినియోగం

● అంజన్న ఉద్యోగిపై పోలీస్‌స్టేషన్‌లో మరోసారి ఫిర్యాదు

● గతంలో రూ.38లక్షలు.. కేసు నమోదు

మల్యాల, సెప్టెంబరు 24 : కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ వేలంల ఇన్‌చార్జీగా విధులు నిర్వహించి దేవస్థానం సొమ్ముల దుర్వినియోగానికి పాల్పడిన కె.శ్రీనివాసాచారిపై అధికారులు మంగళవారం మరోసారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రూ.14 లక్షలు దేవస్థానం ఖాతాకు జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పేర్కొంటూ క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొండపైన దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు విడతల వారిగా తమ సొమ్ములు దేవస్థానానికి చెల్లిస్తుండగా కొన్నాళ్ల క్రితం ఆ బాధ్యతలు నిర్వహించిన శ్రీనివాసాచారి వ్యాపారులు చెల్లించిన 2023-24 సంవత్సర టెండర్లకు సంబంధించిన రూ.37.90 లక్షలు దేవస్థానం ఖాతాలో జమ చేయకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పేర్కొంటూ గత ఫిబ్రవరిలో సస్పెన్షన్ వేటు వేశారు. సస్పెన్షన్‌తో పాటు అతనిపై మల్యాల పోలీస్‌స్టేషన్‌లో అప్పటి ఈవో వెంకటేష్ ఫిర్యాదు చేయగా కేసు నమో దు చేసిన అధికారులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. తాజాగా 2022-23 సంవత్సర ఖాతాలు పరిశీలించగా మరో రూ.14,49,900లక్షలు టెండర్‌దారుల చెల్లించిన సొమ్ములు దేవస్థానం ఖాతాలో జమ చేయనట్లు అధికారులు గుర్తించారు. ప్రస్తుత ఈవో రామకృష్ణరావు మంగళవారం శ్రీనివాసాచారిపై మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగ శ్రీనివాసాచారిపై సస్పెన్షన్ పొడగిస్తూ దేవాదాయ శాఖ అదేశాలు జారీ చేసింది.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బస్సు

● ఒకరికి తీవ్ర గాయాలు

మల్యాల, సెప్టెంబరు 24 : ద్విచక్రవాహనాన్ని వెనుకాల నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మల్యాల మండల కేంద్రానికి చెందిన పత్తిపాక గంగాధర్ జగిత్యాల నుంచి బైక్ పై నుంచి మల్యాలకు వస్తుండగా నూకపల్లి సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వెనుకాల నుంచి వచ్చిన బస్సు ఢీకొంది. దీంతో గంగాధర్ తలకు తీవ్ర గాయాలు అవడంతో పలువురు 108కి సమాచారం అందించగా అంబులెన్స్ ఈఎంటీ ఎస్.జ్యోతి, పైలట్ ఆంజనేయులు ప్రథమ చికిత్స అందజేశారు. గాయపడిన వ్యక్తిని జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

21 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సైదాపూర్, సెప్టెంబరు 24: మండలంలోని జాగీర్‌పల్లిలో అక్రమంగా నిల్వ చేసిన 21క్వింటాళ్ల పీఈడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. జాగీర్‌పల్లి గ్రామంలో మంగళవారం తెల్లవారు జామున సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా, శంకరపట్నం మండలం వంకాయగూడెం గ్రామానికి చెందిన చిన్న బత్తుల రాజయ్య అక్రమంగా ఓ ఇంట్లో 16 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ చేశాడని తెలిసి స్వాధీనం చేసుకున్నామన్నారు. బొమ్మల రామారం బోనగిరి గ్రామానికి చెందిన హేరావత్ మోతిలాల్ వద్ద ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నామని చెప్పారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి

తిమ్మాపూర్, సెప్టెంబరు 24 : మండలంలోని మహాత్మానగర్ రాజీవ్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎల్ఎండి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నుస్తులాపూర్ గ్రామానికి చెందిన మాడిశెట్టి నర్సయ్య (55) సోమవారం రాత్రి అలుగునూర్ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో నరసయ్య తన ద్విచక్ర వాహనంపై నుంచి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో నరసయ్య తీవ్రంగా గాయ పడ్డాడు. ఆయనను కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం తెల్లవారు జామున నరసయ్య మృతి చెందాడు. అతడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎల్ఎండీ ఎస్సై వివేక్ తెలిపారు.

● నర్సయ్య కళ్లు సజీవం

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాడిశెట్టి నర్సయ్య నేత్రాలను ఆయన కుమారుడు మాడిశెట్టి రాజేష్ దానం చేసినట్లు శాతవాహన లయన్స్ క్లబ్, కాశేశ్వరి లయన్స్ బాధ్యులు కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, కంది జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. నరసయ్య పార్థివ దేహం నుంచి జత నేత్రాలను సేకరించి హైదారాబాద్‌లోని ఎల్ వీ ప్రసాద్ అసుపత్రికి పంపించామన్నారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

రామడుగు, సెప్టెంబరు 24: మండలంలోని వెదిర పరిధిలోని వెంకటగిరికి చెందిన విజ్జగిరి శంకరయ్య (65) అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలి పారు. శంకరయ్య మద్యానికి బానిస కావడం మూలంగా పక్షపాతానికి గురయ్యాడు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఈ నెల 19న గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళ వారం మృతి చెందాడు. మృతుడికి కుమారుడు విజ్జగిరి గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో ఎల్లయ్య తెలిపారు.

వరట్నం వేధింపులతో వివాహిత ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 24: వివాహం జరిగిన ఏడు నెలలకే అదనపు వరకట్నం వేధింపులతో కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన దొంత శ్రావణి(22) మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కట్టరాంపూర్‌లోని ఇంటిలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. సిద్దిపేట మండలం ఎల్లంపల్లి గ్రామానికి చెందిన శ్రావణికి ఫిబ్రవరి 25న కట్టరాంపూర్‌కు చెందిన అజయ్‌కుమార్‌తో వివాహం జరిగింది. వివాహ సమ యంలో ఒప్పుకున్న వరకట్నం డబ్బులు, ఇతర లాంఛనాలు ముట్టజెప్పారు. అయినప్పటికీ అదనపు వరకట్నం తేవాలంటూ కొద్ది రోజుల నుంచి శ్రావణిని ఆమె భర్త అజయ్‌కుమార్, అత్త ఉపేంద్ర, మామ అంజనేయులు వేధింపులకు గురి చేస్తుండటంతో జీవితంపై విరక్తి చెందిన తన కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి సంగెం కొంరయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు ముగ్గురిపై వరకట్నం వేధిం పుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ ఒకటో టాణా పోలీసులు తెలిపారు.

కాళేశ్వరం-మంథని-రామగిరి
సర్క్యూట్ అభివృద్ధికి చర్యలు

- దేవాలయాల అభివృద్ధికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేయాలి
- 2027లో జరిగే గోదావరినది పుష్కరాల నిర్వాహణకు చర్యలు
- దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్


వేద పండితులతో మాట్లాడుతున్న శైలజా రామయ్యర్

మంథని, సెప్టెంబర్ 24: కాళేశ్వరం-మంథని-రామగిరి సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్ వెల్లడించారు. మంగళవారం మంథనిలోని శ్రీమహాలక్ష్మీ దేవాలయంలో దేవాదాయ, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు, కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి తీరంలోని శ్రీగౌతమేశ్వర దేవాలయాన్ని పురావస్తుశాఖ అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో దేవాలయాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధిపై సంబంధిత అధికారులతో ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ సమీక్షా నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాళేశ్వరం, మంథని పరిసర ప్రాంతాల్లో ఉన్న ఆలయాలను సందర్శించామన్నారు. కాళేశ్వరం దేవాలయం లోపల, పరిసరాల్లో అభివృద్ధి పనులు చేపట్టే భక్తులకు అవసరమైన వసతులు ఏరకంగా కల్పించాలనే అంశంపై కాళేశ్వరంలో చర్చించామన్నారు. గోదావరినదిని ఏరకంగా శుభ్రం చేయాలి, పుణ్యస్నానాలు చేసేందుకు, షవర్స్ మహిళలకు స్నానాల గదుల ఏర్పాటు విషయాలను చర్చించామన్నారు. మంథనిలో ఆలయాలను సంపూర్ణంగా అభివృద్ధి చేసేందుకు, వచ్చే భక్తులకు కావాల్సిన సదుపాయాల కల్పన కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. దేవాలయాల అభివృద్ధికి రూపొందించే ప్రణాళికల్లో స్వల్ప, దీర్ఘకాలికంగా వేర్వేరుగా ఉండాలన్నారు. 2027 సంవత్సరంలో గోదావరినది పుష్కరాలు వస్తున్నాయని, వీటికి సంబంధించి ఘాట్ అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు. గోదావరినది తీరంలోని శ్రీగౌతమేశ్వర ఆలయం వద్ద పుష్కరాల సందర్భంగా పార్కింగ్ స్థలం గుర్తించాలన్నారు. మంథనిలో ఆలయాలకు ఒక గుడి నుంచి మరో గుడికి హెరిటేజ్ వాకింగ్ చేసే విధంగా ప్రణాళిక చర్యలు తీసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహణ కోసం కళాభారతి లాంటి భవనం నిర్మాణానికి అనువైన స్థలం ఎంపిక చేయాలన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. మంథని పట్టణంలో ఆరు దేవాలయాలు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయన్నారు. శ్రీసిలేశ్వర-సిద్ధేశ్వరాలయం పురావస్తుశాఖ పరిధిలో ఉంటుందన్నారు. శ్రీగౌతమేశ్వరాలయం వద్ద స్నానాల ఘాట్, షవర్లు, స్నాన గదుల ఏర్పాటు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. స్కంధ పురాణం ద్వారా శ్రీగౌతమేశ్వర ఆలయ పురాణం తెలుసుకొని, దీనికి సంబంధించి లైట్‌షో, వాటర్‌షో ఏర్పాటు అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు. శ్రీమహాలక్ష్మి ఆలయం సమీపంలోని చెరువులో అక్రమణలు తొలగించి పునరుద్ధరిస్తామని, చెరువులో డ్రైనేజీ నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రామగిరి ఖిల్లాను పర్యాటకశాఖ పరిధిలో అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీవో హనుమానాయక్, తహసీల్దార్ రాజయ్య, పురావస్తు, దేవాదాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య

● మృతికి తల్లే కారణమంటూ కులస్థులు దాడి ● ఆస్తి తండ్రి పేరు మీదకు మార్చాలని అంత్యక్రియలు నిలిపివేత

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 24 : మండలంలోని జగ్గాసాగర్ గ్రామానికి చెందిన ఏనుగు ప్రభాస్(19) అను యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన ఏనుగు ప్రతాప్, అనంత దంపతులకు కుమారుడు ఏనుగు ప్రభాస్ ఉన్నాడు. ప్రతాప్ జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లాడు. గ్రామంలో ప్రభాస్ తన తల్లితో కలిసి ఉంటున్నాడు. ప్రభాస్ ఇంటర్ పూర్తి చేసి హోటల్ మేనేజ్మెంట్ చేద్దామని తల్లిదండ్రులకు తెలిపాడు. వారు ఏదైనా జాబ్ చేయమని మందలించడంతో మనస్థాపానికి గురై ఈనెల 8న రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించి తల్లి చికిత్స కోసం మెట్‌పల్లికి తరలించగా వైద్యులు పరిశీలించి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతున్న ప్రభాస్ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఈనెల 22న నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న ప్రభాస్ వాంగ్మూలాన్ని మెజిస్ట్రేట్ రికార్డు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆస్తి మార్పిడి కోసం ఆగిన అంత్యక్రియలు

మృతికి తల్లె కారణమంటూ కులస్థులు దాడి..

చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రభాస్ అంత్యక్రియలు ఆస్తి మార్పిడి కోసం ఆగిపోవాల్సి వచ్చింది. ఇల్లరికం వచ్చిన ఏనుగు ప్రతాప్ 17 ఏళ్ల నుంచి గల్ఫ్ వెళ్లి సంపాదించిన ఆస్తి మొత్తం తన భార్య అనంత పేరు మీద ఉందని గ్రామస్థులు ఆరోపించారు. ఆ ఆస్తి మొత్తం ప్రతాప్ పేరున రిజిస్టర్ చేస్తేనే అంత్యక్రియలు చేయాలని అంత వరకు నిలపాలని బంధువులు మృతదేహాన్ని ఇంటి వద్దనే ఉంచారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని ఒప్పించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. మరోవైపు ప్రభాస్ మృతికి తల్లి అనంత కారణమని గ్రామంలోని కులస్థులు ఆరోపిస్తున్నారు. మంగళవారం ప్రభాస్ మృతదేహంతో ఇంటికి వచ్చిన తల్లిపై గ్రామంలోని కులస్థులు దాడి చేశారు. గమనించి ఎస్సై చిరంజీవి ప్రభాస్ తల్లిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. పెద్ద ఎత్తున గ్రామస్థులు చేరుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి అక్కడి చేరుకుని వారిని శాంతింపజేశారు.

జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు బడితండా యువకుడు

రుద్రంగి, సెప్టెంబర్ 24 రుద్రంగి మండలం బడితండా గ్రామానికి చెందిన మాలోత్ అనిల్ జాతీయస్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అనిల్ కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువతున్నాడు. ఇటీవల జరిగిన శాతవాహన యూనివర్సిటీలో ట్రెక్కింగ్ పోటీల్లో పాల్గొన్నాడు. ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. అక్టోబరు 22న హిమచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి ట్రెక్కింగ్ పోటీల్లో పాల్గొననున్నాడు. యువకుడు జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో బడితండా గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగిత్యాలలో ఆన్‌లైన్ మోసం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 24 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ మహిళ ఆన్‌లైన్ మోసానికి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణంలోని పోచమ్మవాడ ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఆన్‌లైన్ యాప్ వలలో చిక్కుకుని అధిక డబ్బులు వస్తాయనే ఆశతో రూ. 1.78 లక్షల పెట్టుబడి పెట్టింది. పెట్టుబడి పెట్టిన మరుసటి రోజే యాప్ కనబడకపోవడంతో మోసాపోయానని గ్రహించిన మహిళ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

'నవోదయ' దరఖాస్తుల గడువు పొడిగింపు

చొప్పదండి, సెప్టెంబరు 24: పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువును అక్టోబరు 7వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 8, 9 తేదీల్లో దరఖాస్తులను ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

పీజీ 2,4 సెమిస్టర్ల పరీక్షల ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 24 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జూలై, ఆగస్టు 2024లో నిర్వహించిన పీజీ, రెండవ, నాలుగవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. ఎంఏ (ఇంగ్లీష్, ఉర్దూ, తెలుగు, ఎకనామిక్స్, సోషియాలజీ, ఎమ్మెస్‌డబ్ల్యూ) ఎమ్ఎస్ఈ(వృక్షశాస్త్రం, జువాలజీ, స్టాటిస్టిక్స్, న్యూట్రిషన్ డైటెటిక్స్) ఎంసీఏ పరీక్షల ఫలితాలు శాతవాహన విశ్వవిద్యాలయం వెబ్సైట్ www. satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయన్నారు.

28న యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 24 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో యోగా ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు ఈ నెల 28 ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కరీంనగర్ ఆయుష్‌శాఖ జిల్లా ఇంచార్జీ డాక్టర్ యస్రబ్‌సుల్తానా, డీపీఎం ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న 90 పోస్టులను భర్తీ చేయనున్నట్లు కరీంనగర్‌లో 15మంది పురుషులు, 15 మంది స్త్రీలు, పెద్దపల్లి 10 మంది పురుషులు, 10 మంది స్త్రీలు, రాజన్నసిరిసిల్ల 8 మంది పురుషులు, 8 స్త్రీలు, జగిత్యాల 12 మంది పురుషులు, 12 మంది స్త్రీలు పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పురుషులు కనీసం 32 యోగా తరగతులు, స్త్రీలు 20 యోగా తరగతులకు హాజరుకావాలని సూచించారు. పురుష శిక్షకులకు ఒక తరగతికి రూ. 250 చొప్పున రూ. 8వేలు, స్త్రీలకు రూ. 5వేలు పారితోషికం ఇస్తారని తెలిపారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్హతతోపాటు కనీసం 6నెలల యోగా సర్టిఫికెట్ ఉండాలని, 45 సంవత్స రాలలోపు వయస్సు కలిగిన ఉండాలని, యోగా నైపుణ్యత ఉండాలని సూచించారు. ఈ పోస్టులు పార్ట్‌టైం పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు కరీంనగర్‌లోని రాంనగర్‌లో గల ఆయుష్, ఆయుర్వేద ఆసుపత్రిలో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

● 7 గేట్ల ద్వారా 21,868 క్యూసెక్కుల నీరు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన గేట్లు మంగళవారం ప్రస్తుత సీజన్‌లో మరోమారు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు చెందిన 7వరద గేట్లను తెరిచి 21,868 క్యూసెక్కుల నీరును దిగువకు వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 45,858 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగునీటి కాలువలు, ఇతర అవసరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 45,858 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నుంచి స్పిల్‌వే ఆర్‌సీగేట్ల ద్వారా నీరు విడుదల చేస్తున్నందున గోదావరినదిలో చేపలు పట్టేందుకు వెళ్లరాదని, వలలు కొట్టుకుపోయే అవకాశం ఉన్నందున బయటకు తీసుకోవాలని, పశువుల కాపర్లు, సామన్య ప్రజలు ఎవరూ నదిలోకి దిగొద్దని, ప్రమాదానికి గురి కావద్దని అధికారులు కోరుతున్నారు.

కూతురికి అత్తింటి వేధింపులు..

- బావిలో దూకి తండ్రి బలవన్మరణం
- 9 గంటల పాటు కొనసాగిన గాలింపు చర్యలు
- లభ్యమైన మృతదేహం
- రాచర్లబొప్పాపూర్‌లో విషాదం


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 24 : కుమార్తెకు న్యాయం జరగడం లేదని సోమవారం రాత్రి పాడు పడిన బావిలో దూకిన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌కు చెందిన అగుళ్ల శ్రీనివాస్ (48) మృతదేహం మంగళవారం తెల్లవారుజామున లభ్యమైంది. కుటుంబసభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలోని అగుళ్ల స్వరూప-శ్రీనివాస్ దంపతులకు కూతురు రమ్య, కొడుకు రాజేశ్ ఉన్నారు. రమ్యను సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి ప్రశాంత్‌కు ఇచ్చి 10 ఏళ్ల కిందట పెళ్లి జరిపించారు. వారికి పదేళ్ల వయసు లోపు ఉన్న ఇద్దరు పిల్లలు రిషివర్ధన్, కీర్తన ఉన్నారు. కొంత కాలంగా భార్యాభర్తల నడుమ కలహాలు చోటు చేసుకుంటున్నాయి. భర్తతో పాటు అత్తింటి వారు రమ్యను వేదింపులకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగాయి. మంచిగా చూసుకోవాలని మందలించినా మార్పు రాలేదు. దాంతో ఆరు రోజుల కిందట రమ్య అత్తింటిలో ఆత్మహత్యాప్రయత్నం చేసింది. విషయం తెలియడంతో తండ్రి శ్రీనివాస్ చేరుకుని చికిత్స చేయించి స్వగ్రామానికి తీసుకు వచ్చాడు. తన కూతురును అత్తింటి వారు వేధిస్తున్నారని పేర్కొంటూ ఈ నెల 21న స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. న్యాయం జరగడం లేదని బావించిన శ్రీనివాస్ సోమవారం రాత్రి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని వారి సంఘానికి సంబంధించిన వాట్సాప్ గ్రూప్‌లో సందేశం పంపి ఇంటి సమీపంలోని పాడుబడిన వ్యవసాయ బావిలో దూకాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. బావి చుట్టూ చెట్లు ఏపుగా ఉండడంతో గాలింపు కష్టతరంగా మారింది. బావిలో నీళ్ల అధికంగా ఉండడం వల్ల మోటార్‌ను తెప్పించి నీటిని తోడేసేలా చర్యలు తీసుకున్నారు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వేకువజాము వరకు తొమ్మిది గంటలపాటు గాలింపు కొనసాగింది. చివరకు శ్రీనివాస్ మృతదేహం లభ్యమవడంతో బయటకు వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

● ఆత్మహత్యకు కారణమైన ఆరుగురిపై కేసు

అగుళ్ల శ్రీనివాస్ ఆత్మహత్యకు కారణమైన సంఘటనలో సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మృతుడి అల్లుడు మిట్టపల్లి శ్రీకాంత్‌తో పాటు ఆయన తల్లిదండ్రులు లక్ష్మీ, వీరస్వామి, సోదరుడు ప్రశాంత్, బంధువులు పద్మ, సతీష్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు.


బావి వద్ద ఎక్స్‌కవేటర్‌తో చెట్ల తొలగింపు

శ్రీనివాస్ కూతురు రమ్యను సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌కు చెందిన మిట్టపల్లి శ్రీకాంత్‌తో 10 ఏళ్ల కిందట పెళ్లి చేశారని పేర్కొన్నారు. కాలంగా భార్యాభర్తల నడుమ కలహాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 20న రమ్యను పుట్టింటి నుంచి అదనంగా ఐదు లక్షల రూపాయల కట్నం తీసుకురావాలని భర్తతో పాటు అత్తమామలు, మరిది, బంధువులు వేధింపులకు దిగడంతో ఆమె ఆత్మహత్యకు యత్నించిందని పేర్కొన్నారు. విషయం తెలిసిన తండ్రి శ్రీనివాస్ చేరుకుని ఆమెకు చికిత్స అందించి రాచర్లబొప్పాపూర్ గ్రామానికి తీసుకువచ్చాడని తెలిపారు. మృతుడు శ్రీనివాస్ కొడుకు రాజేశ్ ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

పిటీషన్ మేనేజ్‌మెంట్‌లో
గోదావరిఖని వన్‌టౌన్‌కు 4వ స్థానం

- రిసెప్షన్ ఆఫీసర్ వెంకట లక్ష్మి సేవలకు గుర్తింపు..
- సత్వర సేవల్లో బెల్లంపల్లి వన్‌టౌన్, ధర్మారం ఠాణాల ఎంపిక


ధర్మారం ఎస్ఐ లక్ష్మణ్


. కానిస్టేబుల్ వెంకటలక్ష్మి

కోల్‌సిటీ, సెప్టెంబరు 24 : పిటీషన్ మేనేజ్‌మెంట్ సిస్టంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు పోలీస్ స్టేషన్‌లను ఎంపిక చేయగా, గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు 4వ స్థానం లభించింది. పోలీస్ స్టేషన్‌లో రిసెప్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న కానిస్టేబుల్ వెంకటలక్ష్మి స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యదగా ప్రవర్తించి వారి సమస్యలను తెలుసుకుని అధికారుల వద్దకు తీసుకవెళ్లేవారు. వారి దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి రశీదు కూడా అప్పగిస్తున్నారు. ఉత్తమ సేవలు అందించినందుకు ఆమెకు గుర్తింపు లభించింది. ఠాణా కూడా ఎంపికైంది. అలాగే సత్వర సేవల విభాగంలో బెల్లంపల్లి వన్‌టౌన్‌కు 3వ స్థానం, ధర్మారం పోలీస్ స్టేషన్‌కు 5వ స్థానం లభించాయి. బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య, ధర్మారం ఎస్ఐ లక్ష్మణ్‌లు ఠాణాలకు వచ్చే బాధితులతో మర్యదగా ప్రవర్తించి వారి సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించడం, వారికి పోలీసులపై నమ్మకం కలిగించారని సీపీ శ్రీనివాస్ తెలిపారు. ప్రజలు ఆన్‌లైన్ ఫీడ్ బ్యాక్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు సత్వర సేవలందిస్తున్న విభాగాల్లో పది ఠాణాలను ఎంపిక చేయగా బెల్లంపల్లి ధర్మారం, ఠాణాలకు స్థానం దక్కింది.

అడవి పందుల దాడిలో వరి పంట ధ్వంసం


ధర్మారంలో అడవి పందుల దాడిలో ధ్వంసమైన వరి పంటను చూపిస్తున్న రైతు

కోనరావుపేట, సెప్టెంబరు 24: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామశివారులో అడవి పందుల దాడిలో వరి పంట మంగళవారం ధ్వంసం అయింది. గ్రామానికి చెందిన బొడ్డు శంకర్, బొడ్డు ప్రవీణ్, మల్లవేని తిరుపతి అనే రైతులకు చెందిన వరి పొలంను అడవి పందులు ధ్వంసం చేశాయి. కోతకు వచ్చే సమయంలో వరి పంటను ధ్వంసం చేశాయని బాధిత రైతులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి నష్టపరిహారం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రుణమాఫీ చేయాలంటూ రైతువేదికకు తాళం

ఇబ్రహీంపట్నంలో నిరసన తెలిపిన రైతులు


రైతువేదికకు తాళం వేసి నిరసన తెలుపుతున్న రైతులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 24 : రెండు లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇబ్రహీంపట్నం రైతులు ఇబ్రహీంపట్నం రైతువేదిక కార్యాలయానికి తాళంవేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రుణమాఫీ, రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 రోజున 2లక్షల రుణమాఫీ చేస్తా అని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు చేయలేదన్నారు. వానాదకాలం సీజన్ ముగిసిన ఇప్పటి వరకు రైతుబంధు రాలేదని ఇప్పటికైన ప్రభు త్వం కళ్లు తెరిచి రుణమాఫీ, రైతు బంధు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు ఏలేటి చిన్నారెడ్డి, నాంపల్లి రమేష్, కల్లెం చిన్న సాయన్న, బాస జలంధర్, తీగల రవీందర్‌రెడ్డి, బద్దం సత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 24 : పెద్దపల్లి మండలంలోని బొంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మేరపల్లిలో బసంత్‌నగర్ పోలీస్‌ల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మేరపల్లిలోని పలు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 15 ద్విచక్రవాహనాలకు సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో జరిమానాలు విధించారు. మేరపల్లి వద్ద ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌లను తనిఖీచేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కార్యక్రమంలో పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్.స్వామి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కోల్‌సిటీ : కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు స్థానిక విఠల్‌నగర్‌లో విస్తృత తనిఖీలు జరిపారు. సుమారు 50 మంది పోలీసులు, నార్కొటిక్ డాగ్స్‌తో తనిఖీలు జరిపారు. 10లీటర్ల నాటుసారా, 18లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. 13నెంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేశారు. తనిఖీల్లో సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

షీ టీమ్‌పై అవగాహన

అంతర్గాం, సెప్టెంబరు 24: రామగుండం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మంగళవారం సీఐ ప్రవీణ్ కుమార్ అధ్వర్యంలో షి టీమ్ సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మల్లయ్య, షి టీమ్ సభ్యులు స్నేహలత, సురేష్, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ మోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఎంఎన్‌వో మృతి

మంథని, సెప్టెంబర్ 24: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంఎన్‌వోగా విధులు నిర్వహిస్తున్న నాగరాజు అనారోగ్యంతో కరీంనగర్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. నాగరాజు మృతిపై పలువురు విచారం వ్యక్తం చేశారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

కోలసిటీటౌన్, సెప్టెంబర్ 24: నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ ఆఫ్ ఆర్టిస్ట్స్ అండ్ ఆక్టివిస్ట్స్(నిఫా) సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా మంగళవారం గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ప్రిన్సిపాల్ సంజవయ్య, నిఫా బాధ్యులు యాదవరాజు, ఎన్ఎస్ఎస్ అధికారులు తాజోద్దిన్, శంకర్, కనకయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 24: తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖని రమేష్‌నగర్‌లోని వాసవ్య విద్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీటీసీ కౌన్సిలర్ కట్కూరి శంకర్ హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వాసవ్య విద్యాలయం కరస్పాండెంట్ బండి చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్‌లో బొడ్డెమ్మ వేడుకలు

సుల్తానాబాద్, సెప్టెంబర్ 24: సుల్తానాబాద్ పట్టణంలో బొడ్డమ్మ వేడుకలు ప్రారంభించారు. స్థానిక శివాలయంలో మంగళవారం బతుకమ్మ పండగలో భాగంగా మొట్ట మొదటిసారిగా బొడ్డెమ్మను ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని అన్నివార్డుల్లో బొడ్డెమ్మ వేడుకలు నిర్వహించి బతుకమ్మలు ఆడారు.

ఏబీవీపీ కార్యకర్తల సమావేశం

కమాన్‌పూర్, సెప్టెంబర్ 24 : ఏబీవీపీ మంథని నగర ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. పెద్దపల్లి నూతన నగర కార్యదర్శిగా జంగపల్లి అరవింద్, నగర ఉపాధ్యక్షులుగా ఆరెపల్లి వినోద్, అఖిలేష్, నగర సంయుక్త కార్యదర్శులుగా విశాల్, తోటపల్లి జశ్వంత్, శ్రీనివాస్, సోషల్ మీడియా ఇన్‌చార్జీ దాసరి అఖిలేష్, వినయ్‌లు నియమించినట్లు జిల్లా కన్వీనర్ బండి రాజశేఖర్ తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 24 : మండలంలోని తుర్కలమద్దికుంటలో రాగినేడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ శంకర్, ఎంఎల్‌హెచ్‌పీ సుశ్మిత, ఏఎన్‌ఎం తిరుమల, ఆశ కార్యకర్తలు అరుణ, రాధ, సునిత పాల్గొన్నారు.

పుష్కర ఘాట్ వద్ద స్వచ్ఛతా హీ సేవా

కోల్‌సిటీ, సెప్టెంబరు 24:స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా రామగుండం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరి పుష్కర ఘాట్ వద్ద పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ క్యాడెట్లు నదీతీరాన్ని శుభ్రం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా, రామగుండం నగర పాలక సంస్థ సెక్రెటరీ రాజు, హెల్త్‌అసిస్టెంట్ సునీల్‌రాథోడ్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు అభినందన

కోల్‌సిటీ, సెప్టెంబరు 24: రాష్ట్ర వ్యాప్త పోలీస్ స్టేషన్‌లలో ఉత్తమ మహిళా రిసెప్షనిస్టుగా ఎంపికైన గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ వెంకటలక్ష్మిని మంగళవారం వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐలు ఓ రమేష్, శ్రీనివాస్, భూమేష్‌ల అభినందించినారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం



గోదావరిఖని ప్రభుత్వ బాలికల కళాశాలలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేస్తున్న జిల్లా నోడల్ ఆఫీసర్ కల్పన

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 24: ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం గోదావరిఖనిలో ఘనంగా జరిగాయి. యూనివర్సిటీ పీజీ కళాశాలలో జరిగిన వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సురేష్‌కుమార్ మాట్లాడారు. అనంతరం కళాశాలలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వై.ప్రసాద్, అధ్యాపకులు రమేష్, రవి, అజయ్‌కుమార్, యాదయ్య, సావిత్రి వలంటీర్లు పాల్గొనారు. ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జిల్లా నోడల్ అధికారి, ప్రిన్సిపాల్ డి.కల్పన హాజరై స్వామి వివేకానంద, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. ఎన్ఎస్ఎస్ పీవో డి.శంకర్, ఎన్‌వైపీ కోఆర్డినేటర్ యాదవరాజు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సంజీవయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జీడీ కనక య్య, అధ్యాపకులు అబ్దుల్ రహమాన్, కె.శ్రీనివాస్, ఎన్‌వైపీ కోఆర్డినేటర్ యాదవ రాజు, శంకరయ్య, రామ్మూర్తి, రాణి, శ్రీగోదా, భాగ్యలక్ష్మి, శారద, అశోక్, మహ్మద్ రఫీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మంథని : స్థానిక ప్రభుత్వ డిగ్రీ, బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం అవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థులకు అలవడే సేవా గుణం గురించి వక్తలు కొనియాడారు. ఆయా కళాశాల ప్రిన్సిపాల్స్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముత్తారం : ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలను కళాశాల ఆవరణలో మంగళవారం నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.ఎన్‌రావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ జంగాపల్లి రాజేశం, లింగమూర్తి, బన్సీలాల్, చందర్, చంద్రమౌళి, జయ, జెరూష, లక్ష్మి, శ్రీనివాస్, సంపత్, రాజనర్సు, రాజులతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలోని శ్రీవాణి డిగ్రీ, పీజీ కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీవాణి పీజీ కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్, ప్రోగ్రాం అధికారి శ్రావణ్‌కుమార్, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దపల్లి కల్చరల్ : స్థానిక గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ డే వేడుకలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సమద్ ఆధ్వర్యంలో వలంటీర్లు గాయత్రి డిగ్రీ కళాశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధినేత అల్లెంకి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే ట్రినిటి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ డే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి హాజరయ్యారు. వలంటీర్లు ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని తిలకించారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ సీతారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాను పకడ్బందీగా రూపొందించాలి : కలెక్టర్

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 24 : గ్రామపంచాయతీ ఓటర్ జాబితాను పకడ్బందీగా రూపొందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం కలెక్టర్ మండలంలోని రాఘవపూర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి గ్రామ ఓటర్ జాబితా రూపకల్పన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ డ్రాఫ్ట్ ఓటరు జాబితాపై వచ్చిన ఫిర్యాదులను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఓటర్ జాబితా రూపకల్పనలో వస్తున్న ఇబ్బందులు, సమస్యలను మండలాల వారిగా తెలుసుకున్న కలెక్టర్ వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలోని గ్రామపంచాయతీలలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఎంపీవోకు సూచించారు. కలెక్టర్ వెంట పెద్దపల్లి ఎంపీడీవో ఘనుకోట శ్రీధర్, ఎంపీవో ఫయాజ్, పంచాయతీ కార్యదర్శి తూముల రవి పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : గ్రామపంచాయతీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో వార్డుల వారిగా ఓటరు జాబితాను పకడ్బందీగా సిద్ధం చేయాలని పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటరు జాబితాను సిద్ధం చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయిన నేపథ్యంలో అధికారులు జాబితాలో



రాఘవపూర్ గ్రామపంచాయతీలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్

ఎలాంటి తప్పులు దొర్లకుండా సిద్ధం చేయాలన్నారు. విధి నిర్వహణలో ఆలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు.ఈ సమావేశంలో డీఎల్‌పీవో సతీష్‌కుమార్, ఎంపీడీవో లలిత, ఎంపీవో భాస్కర్‌లు ఉన్నారు.

బాలల రక్షణ-సంరక్షణ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 24: గోదావరిఖని రమేష్‌నగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల రక్షణ-సంరక్షణ చట్టాలపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ కోఆర్డినేటర్ ఉమాదేవి, కౌన్సిలర్ సతీష్, ప్రిన్సిపాల్ పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో వివిధ సామాజిక అంశాలపై బాలికలకు అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ దయా అరుణ, జెండర్ స్పెషలిస్ట్ చెంద్రు స్వప్న, పాఠశాల హెచ్‌ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎర్లీ లెర్నర్ అసైన్మెంట్ టూల్ పై సమీక్ష

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 24 : ఎర్లీ లెర్నర్ అసైన్మెంట్ టూల్‌పై కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం గూగుల్ మీట్ ద్వారా అజిత్ ప్రేమ్ జి ఫౌండేషన్ వారితో ప్రీ స్కూల్ యాక్టివిటీ ప్లానింగ్, ఇంప్లిమెంటేషన్‌పై గూగుల్ మీట్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అజిత్ ప్రేమ్జీ ఫౌండేషన్ ప్రతినిధులు ఎర్లీ లెర్నర్ అసెస్మెంట్ టూల్ ఈజీగా పిల్లలు నేర్చుకునే విధంగా రూపుదిద్దుకోవటం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లో ప్రీ ప్రైమరీ రివైజ్డ్ కరికులం సిలబస్‌ను బలోపేతం చేయడానికి ముందుగా బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, సీడీపీవోలు, జిల్లా నోడల్ అధికారులు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార కేంద్రాల్లో అభివృద్ధి పనులకు సహకరించండి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, సెప్టెంబరు 24: గోదావరిఖని లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్ వ్యాపార కేంద్రాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు వ్యాపారులందరూ సహకరించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి వ్యాపార కేంద్రాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. వ్యాపార కేంద్రాల అభివృద్ధికి రూ.30కోట్లకుపైగా కేటాయించామని, అభివృద్ధికి సంబంధించి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. భవిష్యత్‌లో వ్యాపార కేంద్రం ఊహించని రీతిలో అభివృద్ధి చెందుతుందన్నారు. ఏమైన ఇబ్బందులు ఎదురైతే తనను సంప్రదించాలని, తగు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూడాలి..

కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చొరవ చూపాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం



లక్ష్మీనగర్‌లో వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఐదు గ్యారంటీలు నెరవేర్చిందని, ఉచిత విద్యుత్, గృహజ్యోతి గ్యాస్ సబ్సిడీ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ రూ.10లక్షలకు పెంపు, రైతులకు రుణమాఫీ వంటి పథకాలను అమలుచేసిందన్నారు. త్వరలోనే ఇందిరమ్మ పథకం కూడా అమలులోకి రానున్నదన్నారు. కార్పొరేషన్‌లోని 50డివిజన్లలో నాయకులు, కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండి సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, నాయకులు ఉన్నారు.

ఖని జనరల్ ఆసుపత్రిలో నీటి సరఫరా బంద్

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 24: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెండు రోజులుగా బోర్‌వెల్ పని చేయకపోవడంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండు రోజులుగా కనీసం బాత్‌రూమ్‌కు వెళ్లాలన్నా కూడా ఇబ్బందులు పడ్డారు. ఆసుపత్రిలో ఉన్న ఏకైక బోర్‌వెల్ పని చేయకపోవడం వల్ల రోగులు ఇబ్బందులు పడ్డారు. ఒకే బోర్ ఆసుపత్రి అంతటికి నీటి సరఫరాను చేయడం వల్ల, అది పని చేయనప్పుడు ఇబ్బందులు పడాల్సి వస్తుంది ఆసుపత్రిలో నీటి సమస్యను తీర్చడానికి మరో బోరు వేసి రోగులకు నీటిని అందించాలని పలువురు కోరుతున్నారు.

బోర్‌వెల్‌కు మరమ్మతులు..

ఆసుపత్రిలో బోర్‌వెల్ పనిచేయకపోవడంతో మంగళవారం సిబ్బంది బోరు మోటారు బయటకు తీసి నాలుగు గంటలు శ్రమించిన సిబ్బంది మరమ్మతులు నిర్వహించారు. అనంతరం నీటి సరఫరా చేయడంతో రోగులు, వారి బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎస్‌జీఎఫ్ కరాటే పోటీల్లో ప్రతిభ

మంథని, సెప్టెంబర్ 24: గోదావరిఖని ఆర్‌సీవోఏ క్లబ్‌లో నిర్వహించి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీల్లో మంథని జేకేఏ షోటోకాన్ కరాటే చెందిన 9 మంది విద్యార్థులు తమ ప్రతిభ కనబర్చి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలకు ఎంపికైనట్లు షోటోకాన్ ఇన్‌స్ట్రక్టర్ కొండ్ర నాగరాజు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను జేకేఏ సౌత్ జోన్ ఇంచార్జి రాపోలు సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, పీఈటీలు మాధురి, ఇంద్రాణి, శివ, సతీష్‌లు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కేటీఎస్ విద్యార్థులు

స్థానిక కృష్ణవేణి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, కృష్ణవేణి హైస్కూల్ ప్రిన్సిపాల్ జాఫర్‌లు మంగళవారం తెలిపారు. పెద్దపల్లి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్-17 బాలుర విభాగంలో పాల్గొన్న ఎండీ సిరాజ్ హుస్సేన్, ఎస్. సాత్విక్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు తెలిపారు. వీరిని పాఠశాల టీచర్లు, విద్యార్థులు అభినందించారు.

విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలి

- అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

సుల్తానాబాద్, సెప్టెంబర్ 24: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాన్ని ఏర్పచుకోవాలని లక్ష్య సాధన కోసం క్రమపద్ధతిలో కృషి చేసి ఉన్నత భవిష్యత్తును పొందాలని జిల్లా అదనపు కలెక్టర్ జి శ్యామ్ ప్రసాద్‌లాల్ అన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్‌డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రాంచెంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్ధేశించుకోవాలన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కల్పన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం ఎంసెట్, నీట్ పరీక్షలకు ఇస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పరిహారంలో అర్హులకు అన్యాయం

మంథనిరూరల్, సెప్టెంబర్ 24: నేషనల్ గ్రీన్‌పీల్డు హైవే నిర్మాణంలో అర్హులైన బాధితులకు పరిహారం చెల్లింపులో అన్యాయం జరుగుతోందని పుట్టపాక మాజీ ఉప సర్పంచ్ తిరుపతిరెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పుట్టపాకలో అధికారులు పూర్తి స్థాయిలో సర్వే చేయకుండానే అర్హులకు అన్యాయం చేశారన్నారు. ఈ విషయంలో కలెక్టర్ విచారణ చేయించి అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు. వినోద్‌కుమార్, మల్లయ్య, ఓదెలు, గట్టయ్య, రమేష్, లక్ష్మణ్, పోచాలు, మల్లేష్, సుగుణ, స్వామి, సదానందంలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ముత్తారం, సెప్టెంబర్ 24: మండలంలోని దర్యాపూర్ గ్రామ శివారులోని ఆదర్శ పాఠశాలలో టీజీఎమ్ఎస్, పీజీ, బీఈడీ, టెట్ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి సబ్జెక్టులు బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. పిజిటి మ్యాథమెటిక్స్, బయాలజీ, టిజిటి మ్యాథమెటిక్స్ తెలుగు సబ్జెక్టుల బోధించేందుకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు. అర్హత కలిగిన వారు ఈనెల 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉన్నట్లు ఆమె తెలిపారు.

తహసీల్దార్ ఎదుట ఒకరి బైండోవర్

ముత్తారం సెప్టెంబర్ 24: మండలంలోని ఖైదంబండ గ్రామానికి చెందిన కండె రమేష్‌పై కేసు నమోదు చేసి మంగళవారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన మంథని ఓదెమ్మ ఇంటి ముందుకు వచ్చి మంత్రాలు చేస్తున్నామని దుర్భాషలాడడంతో న్యూసెన్స్ చేస్తున్నాడని ఫిర్యాదు చేయడంతో వారిపై కేసు నమోదు చేసి సత్ప్రవర్తన గురించి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

అనుమతులు లేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 24: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అనుమతులు లేని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం రామగుండం మండల విద్యాధికారి ఆరెపల్లి రాజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేణుకుంట్ల ప్రీతం, గొడిసెల ప్రణీత్, గాజుల వినయ్ పాల్గొన్నారు.

తెలంగాణ చరిత్ర పుస్తకం అధికారులకు అందజేత

ఎలిగేడు, సెప్టెంబర్ 24 : మండల కేంద్రంలో మంగళవారం తెలంగాణ చరిత్ర పుస్తకంను తహసీల్దార్ బషీరోద్దీన్, పిహెచ్‌సి వైద్యులు నిస్సి క్రిష్టాన, ఎంఈవో కవిత, పంచాయతీ కార్యదర్శి అంజలి, జూలపల్లి ఎస్సై శ్రీధర్‌కు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బింగిరాజు, మండల అధ్యక్షుడు కవ్వంపల్లి రాము, న్యాతరి పోచయ్య, కాశిపాక అనిల్, కట్ల ప్రతాప్, పంగ రవి, యసాల శ్రీనివాస్ ఉన్నారు.

28న జాబ్ మేళా నిర్వహణ

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 24: జిల్లాలోని నిరుద్యోగ యువకులకు హైదరాబాద్‌లోని స్టాఫింగ్ టైటాన్స్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించడానికి ఈనెల 28న శనివారం ప్రభుత్వ ఐటీఐ కేంద్రం, పెద్దపల్లిలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై. తిరుపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టాఫింగ్ టైటాన్స్ కంపెనీలో హైదరాబాద్‌లో 50 టెక్నీషియన్ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, ఏదైనా ఐటీఐ కోర్సు చదివిన వారు అర్హులని, వీరి వయస్సు 18 నుంచి 33 ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. 8985336947, 8121262441 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

28న ఇసుక వేలం పాట

ఓదెల, సెప్టెంబరు 24 : రెవెన్యూ కార్యాలయం వద్ద నిల్వచేసిన ఇసుకకు ఈనెల 28న కార్యాలయ సమీపంలో ఉదయం 11 గంటలకు వేలం పాటను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ యాకయ్య తెలిపారు. మండలంలోని కనగర్తిలో కొద్ది రోజుల క్రితం అక్రమంగా నిల్వ చేసిన దాదాపు 25 ట్రాక్టర్ల ఇసుకను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు రెవెన్యూ కార్యాలయం వద్ద నిల్వచేసిన ఇసుకను వేలం ద్వారానే విక్రయించుటకు కలెక్టర్ అనుమతిచ్చారని, ఆసక్తి ఉన్నవారు వేలం పాటలో పాల్గొనాలని తహసీల్దార్ కోరారు.

మృతుడి కుటుంబానికి చేయూత

ఓదెల, సెప్టెంబరు 24 : మండలంలోని కొమిరలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నాగపురి శ్రీనివాస్ కుటుంబానికి ఇదే గ్రామానికి చెందిన హమాలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రూ.21 వేలు అందజేసి చేయూత అందించారు. అలాగే గాజుల కుమార్ అనే వ్యక్తి రూ, రెండు వేలు నగదు, క్వింటాల్ బియ్యం బస్తాను కుటుంబానికి అందజేసి తన ఉదారతను చాటుకున్నారు. పలువురు హమాలీలు విలేకరులతో మాట్లాడుతూ, దీన స్థితిలో ఉన్న శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామస్థులు ముందుకు రావాలని కోరారు.

సిమ్స్‌లో 95శాతం ఉత్తీర్ణత

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 24: సింగరేణి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌లో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 95.3శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు తెలిపారు. మొత్తం 149 మంది విద్యార్థులు ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా అందులో 142 మంది ఉత్తీర్ణత సాధించారని, 67మంది విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారని ఆమె తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 95శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల ప్రిన్సిపాల్ హిమబిందు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

కమాన్‌పూర్, సెప్టెంబర్ 24: మండల కేంద్రంలోని ఆపిల్ కిడ్స్ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మాటేటి రాజమణి, భూలక్ష్మీలను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా ట్రస్మా ఎంపిక చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ చదువు వెంకట్‌రెడ్డి తెలిపారు.మంగళవారం ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డును తీసుకున్నారు.

అక్టోబరు 9న కార్మికులకు లాభాల వాటా చెల్లింపు

గోదావరిఖని, సెప్టెంబరు 24: సింగరేణి లాభాల్లో కార్మికులకు ప్రకటించిన వాటాను అక్టోబరు 9న వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు సింగరేణి యాజమాన్యం ప్రకటించింది. అమెరికాకు వెళ్లిన సీఎండీ బలరాం అక్కడి నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సంస్థ డైరెక్టర్లు, అన్ని ఏరియాల జీఎంలు, కార్పొరేటర్‌ల జీఎంలతో నిర్వహించిన సమావేశంలో ఈమేరకు ఆదేశించారు. ఈ మధ్యనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సింగరేణి సంస్థ 2023-24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన నికర లాభాల్లో 33శాతం కార్మికులకు బోనస్‌గా ప్రకటించారు. ఆ మొత్తం రూ.796 కోట్లను అక్టోబర్ 9న సింగరేణి యాజమాన్యం కార్మికులకు చెల్లించనున్నది. సంస్థలో పని చేస్తున్న 42వేల మంది అధికారులకు, కార్మికులకు ఈ లాభాల వాటాను పంపిణీ చేస్తారు. గత ఆర్థిక సంవత్సరంలో కార్మికులు పని చేసిన పనిదినాల సంఖ్యను పరిగణలోకి ఈ లాభాల వాటాను సింగరేణి చెల్లిస్తుంది. సగటున ఒక్కో కార్మికునికి సుమారు రూ.1.9లక్షలు లాభాల వాటా పొందే అవకాశం ఉంది. తొలి సారిగా సింగరేణిలో పని చేస్తున్న 25వేల మంది కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల వాటా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అందుకు అగుణంగా కూడా విధి విధానాలను రూపొందించాలని సీఎండీ బలరాం ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంలో వివిధ కాంట్రాక్టర్ల వద్ద పని చేసిన కార్మికుల వివరాలు పూర్తిగా సేకరించాలని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా కాంట్రాక్టు కార్మికులకు కూడా రూ.5వేలు దసరా పండుగ ముందే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సీఎండీ సూచించారు.

సెప్టెంబర్ వేతనాలతోనే దసరా అడ్వాన్స్ రూ.25వేలు..

లాభాల వాటా చెల్లింపులే కాకుండా సంస్థలో గతంలో ఉన్న సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ దసరా పండుగ అడ్వాన్స్‌ను సైతం సెప్టెంబర్ నెల వేతనాలతోనే సింగరేణీయులకు చెల్లించాలని సీఎండీ సూచించారు. ఒక్కొక్కరికి రూ.25వేలు పండుగ అడ్వాన్స్‌గా ఇవ్వనున్నారు. ఇందుకోసం సంస్థ రూ.95కోట్లు కేటాయించింది. సెప్టెంబర్ నెల వేతనాలతోపాటే పండుగ అడ్వాన్స్ ఉద్యోగుల ఖాతాల్లో జమచేయనున్నారు. పండుగ అడ్వాన్స్‌లాభాల మొత్తం రూ.900కోట్లు కార్మికుల ఖాతాల్లో జమకానున్నాయి. ఇందుకు సింగరేణి ఆర్థిక విభాగం, సిబ్బంది ఏర్పాట్లు చేస్తున్నాయి.

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

రామగిరి, సెప్టెంబరు 24: ఆర్జీ-3 డివిజన్ పరిధి సెంటినరీకాలనీలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. సింగరేణి 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన లాభాలను తక్కువగా చూపిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు మోసపూరితంగా వ్యవహరించాయని ఆరోపిస్తూ మంథని-పెద్దపల్లి ప్రధానరహదారిపై దిష్టిబొమ్మను దహనంచేశారు. ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య, నాయకులు కేశవరావు, పాశం శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్, వెంకటేష్, సందీప్; సురేష్, సత్యనారయణ, రమేష్, కొమురయ్య, సంతోష్, చంద్రశేఖర్, గండి శ్రీనివాస్, ప్రమోద్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : లాభాల వాటాలో రాష్ట్ర ప్రభుత్వం, గెలిచిన సంఘాలు కార్మికులను తప్పుదోవ పట్టించి మోసం చేశాయని ఆరోపిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ దహనానికి టీబీజీకేఎస్ శ్రేణులు యత్నించాయి. ఆర్జీ-2యూనియన్ ఆఫీస్ ఎదుట నినాదాలు చేస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయబోగా పోలీసులు అడ్డుకుని దిష్టిబొమ్మను తరలించారు. ప్రభాకర్‌రెడ్డి, బేతి చంద్రయ్య, అనిల్‌రెడ్డి, సురేందర్, రవితేజ, మామిడి తిరుపతి, లింగారెడ్డి, శ్రీను, వెంకటేష్, రాకేష్, నరేష్, రాజేశం,నారాయణరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

గోదావరిఖని :సింగరేణి లాభాల వాటాపై నిరసనగా టీబీజీకేఎస్ మంగళవారం ఖని చౌరస్తాలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసింది. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రామమూర్తి, నాయకులు వడ్డేపల్లి శంకర్, నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, చెల్పూరి సతీష్, పొలాడి శ్రీనివాస్, రాజేశం, చెలుకలపెల్లి శ్రీనివాస్, వాసర్ల జోసఫ్, దూట శేషగిరి, బొగ్గుల సాయి, లక్ష్మణ్, తిరుపతి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియామకం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 24: ఆర్జీ-2 ఏరియా వర్క్‌షాప్ పిట్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. సెక్రెటరీగా గుండా శశాంక్, అసిస్టెంట్‌సెక్రెటరీగా సురేందర్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కే రాజు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా అజయ్‌కుమార్, శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీలుగా రఘునారాయణరెడ్డి, శ్రీనివాస్, ట్రెజరర్‌గా సత్తయ్య, రవీందర్, కృష్ణ, శ్రీనివాస్‌లను సభ్యులుగా ఎన్నుకున్నారు. ఏరియా వైస్‌ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్ వారిని వర్క్‌షాప్ డీజీఎంకు పరిచయం చేశారు. సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి, మల్లేశ్వరరావు, రామశర్మ, తిరుపతిలు ఉన్నారు.

విద్యుత్ సంస్థల బకాయిలను ఇప్పించాలి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 24: సింగరేణికి విద్యుత్ సంస్థల నుంచి బాకీలను ఇప్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సింగేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఓసీపీ1లో జరిగిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26న జీఎం ఆఫీస్‌ల ఎదుట ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు. ఆర్జీ-3 వైస్‌ప్రెసిడెంట్ అరుకుల ప్రసాద్, వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



లాభాల వాటాపై గందరగోళం సృష్టించే ప్రయత్నం

- ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సెక్రెటరీ వైవీ రావు

రామగిరి, సెప్టెంబరు 24: సింగరేణి వాస్తవ లాభాల వాటాపై కొన్ని సంఘాలు అసత్య అవాస్తవాలు కల్పిస్తూ కార్మికులను గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నాయని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వైవీ రావు ఆరోపించారు. మంగళవారం ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీలో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులకు లాభాల వాటాను 33 శాతం ఇప్పించిన ఘనత ఏఐటీయూసీకే దక్కిందని, ఇది కార్మికుల విజయంగా అభివర్ణించారు. సింగరేణి కార్మికులతోపాటు సమానంగా పనిచేస్తున్న అసంఘిత కార్మికులకు సైతం రూ.5వేలను ఇప్పించిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో సెంట్రల్ సెక్రెటరీ జూపాక రాంచందర్, బ్రాంచి సెక్రెటరీ ఎంఆర్‌సీ రెడ్డి, నాయకులు కుమారస్వామి, రమేష్, సేఫ్టీ, మైన్స్ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 24: కారుణ్య నియామకాల్లో భాగంగా ఆర్జీ-2 ఏరియా పరిధిలో పనిచేస్తూ చనిపోయిన, మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన వారి వారసులకు మంగళవారం అఫీషియేటింగ్ జీఎం ఏ నెహ్రూ నియామక పత్రాలను అందజేశారు. ఏరియా పరిధిలో ఏడుగురికి పోస్టింగ్‌లు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, డీవైపీఎం వంశీధర్ పాల్గొన్నారు.